


బ్రహ్మానందానికి ఆ రోజు బ్రహ్మాండమైన ఆనందంగా ఉంది! అంత ఆనందం పొందడానిక్కారణం—అతని కథ నో పెద్ద పేరున్న ప్రసిద్ధ వారపత్రికలో అచ్చుకావడమే!

కథ పడినంత మాత్రాన, అంత ఆనందం పొందే వాళ్ళున్నారా? అని మీకు అనుమానంగా ఉంటే నే నొప్పుకోను కానీ—అంత ఆనందం కలిగినందుక్కారణం మీకు చెప్తే మీ రొప్పుకోవచ్చు!

బ్రహ్మానందం గత పదేళ్ళుగా కథలు రాస్తున్నాడు. వందా, రెండొందలూ కాదు! కొన్ని వేల కథలు రాశాడతడు—అతిశయోక్తి కాదు! రాసినవన్నీ బాణాల్లా పత్రికలమీదకు వదిలాడు కూడాను! అయితే ఇన్నివేల కథల్లోనూ ఒక్కటంటే ఒక్కటి ఇన్నాళ్ళకు—తాను కలంపట్టిన పదేళ్ళనాటికి అచ్చుముఖం చూసిందంటే, కలిగే ఆనందం వర్ణనాతీతం కాదంటారా? ఒక్కసారి మీరు బ్రహ్మానందం స్థానంలో ఉండి ఆలోచించి చూడండి! మీకూ ఆ ఫీలింగ్ కలగకపోతే నన్నడగండి!

తనకు పరిచయం ఉన్న వ్యక్తులతోసహా, స్నేహితుల్ని, డియరెస్టుల్ని, నియరెస్టుల్ని అందర్నీ పిలిచి, భారీగా పార్టీ యిచ్చి, తదనంతరం తన కథని తన స్వంత గొంతుకతో వాళ్ళందరికీ వినిపించి, 'ఎలా ఉంది?' అని అడిగాడు.

వాళ్ళంతా ముక్త కంఠంతో 'బావుంది' అని ప్రశంసించారు.

బ్రహ్మానందానికి వాళ్ళు బావుందన్న దేమిటో అర్థంగాక "బావున్నది నా కథా? లేక నేనిచ్చిన పార్టీయా?" అని అనుమానంగా అడిగాడు.

"అదేమిటి గురూ! రెండూ బావున్నాయి! ఇలాగే పది కాలాలపాటు వర్ధమాన రచయితగా వర్ధిల్లుతూ మాకు పార్టీ లిస్తుండాలి!" అన్నారు వాళ్ళు.

"ఎప్పుడూ వర్ధమాన రచయితగానే ఉండిపోవాలా? పెద్ద రచయితల లిస్టులోకి చేరి ప్రఖ్యాత రచయితవి కావాలని దీవించకూడదం[illegible]?" అమాయకంగా అడిగాడు బ్రహ్మానందం.

"ఒక్కసారే పెద్ద రచయితవై కూర్చుంటే, మాకు పార్టీ లెవరిస్తార్రా? కనీసం నో అరపంద

కథలు ఏదేరకమైనా, నాకు పార్సిల్ చెయ్యరా!'' అని పోశేశారు మిత్రబృందం.

ఇలాంటివాళ్లెల్లా తన కథమీద సరైన అభిప్రాయం తెలీదని, పైవారం ఉత్తరాల శీర్షికలో తన కథమీద పాఠకుల అభిప్రాయాలు చూడొచ్చునీ, అప్పటికి అనుకున్నాడు బ్రహ్మానందం.

పై వారం పత్రిక వచ్చింది.

ఆత్రంగా ఉత్తరాల పేజీ తిప్పాడు బ్రహ్మానందం.

తన కథ గురించి ఒక్క పాఠకుడూ ఉత్తరం వ్రాయలేదు. తన కథ పడిన సంచికలోనే వచ్చిన మిగతా రెండు మూడు కథలూ బావున్నాయనీ, ఆయా రచయితలకూ అభినందనలు తెలియజెయ్యవలసిందనీ చాలామంది ఉత్తరాలు వ్రాశారు.

బ్రహ్మానందానికి నిజంగానే ఏడుపొచ్చింది. దాంతోపాటే పాఠకులందరిమీదా కోపమొచ్చింది.

''పిల్లెంత పక్షపాతులు! కొత్త పేరున్న రచయిత వ్రాసిన కథలకు బ్రహ్మరథం పడతారు గానీ, కొత్త రచయితల కథల్నెవడూ 'కేర్' చెయ్యరు.'' అనుకుంటూ, కోపం పట్టలేక పత్రికను గట్టిగా విసిరేశాడు.

ఆ పై వారం సంచికో కూడా చూద్దామనిపించి, ఉత్తరాల పేజీ తిప్పాడు. అంతే! ఓ చోట టక్కున బ్రహ్మానందం దృష్టి ఆగిపోయింది. ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకున్నాడో లెక్కలేదు. ఇంకా సంతోషం పట్టలేక, పత్రికను ముద్దెట్టేసుకున్నాడు కూడా!

ఆ ఉత్తరం ఇది—

''నా అభిమాన నటుడు హీరో చంద్రమోహన్ ముఖచిత్రంతో సంచిక సర్వాంగ సుందరంగా ఉంది. సీరియల్స్ ఇంట్రస్టింగ్‌గా సాగుతున్నాయి. ఈ వారం ప్రచురించిన కథల్లో అన్నీ బావున్నాయి. ముఖ్యంగా చెప్పుకోవాల్సింది బ్రహ్మానందంగారి 'పూదోటలో పిడకల వేట' నాకు బాగా నచ్చింది. కథలో రచయితగారు 'మొక్కల కోసం తెచ్చిన ఎరువు' (పచ్చపేడ) పిడకలుగా మారిన వైనం కూడా తెలియజేస్తే బావుండేది. అయినా కథ బాగానే ఉంది.!!

''ఓ! ఓ! కథంతా బాగానే రాశానన్నమాట! ఎరువుని విషయం పేరా రాద్దామనుకుంటూనే మర్చిపోయాను. పాఠకులు ఎంతో తెలివైన వాళ్లు! ప్రతి చిన్న ఇన్సిడెంట్‌నీ గుర్తించి సద్విమర్శ చేస్తారు.'' అనుకొని ''ఇంత మంచి విమర్శ ఎవరు చేశారా?'' అని ఉత్తరం క్రింద పేరుకోసం చూశాడు.

''ఎస్. వాహిని—రైల్వే కాలనీ—విశాఖపట్నం'' అని ఉంది.

ఈసారెప్పుడైనా విశాఖపట్నం వెళ్తే, ఆవిడను కల్సుకొని, తన రచనమీద సద్విమర్శ చేసినందుకు గాను—ఆమెని అభినందించి, తను మర్చిపోయిన సంఘటన...అదే పేడను పిడకలుగా మార్చిన దాన్లో చెప్పాలనుకున్నాడు.

* * *

ఉ బ్రహ్మానందం తాతగారు విజయనగరంలో ఉంటున్నారు. బ్రహ్మానందం ఆ వూరు వెళ్ళాలంటే విశాఖపట్నం మీదుగానే వెళ్ళాలి. తన కథ పడిన నెల రోజుల తర్వాత బ్రహ్మానందానికి తాతగారి వూరెళ్ళాల్సిన అవసరం వచ్చింది. ఇకనేం? దారిలో దిగేసి, వాహిని గార్ని కలుసుకోవాలని, తన రచన ను అభిమానించిన ఆవిడని చూడాలని అనుకున్నాడు బ్రహ్మానందం.

బస్సులో కూర్చున్నంత సేపూ ఆమె గురించే ఆలోచనలు!

ఆమె ఎలా ఉంటుంది? అందంగా ఉంటుందేమో! పద్దెనిమిదేళ్ళు ఉండవచ్చునేమో! బహుశా ఏ ఇంటర్మీడియట్ చదువుతూండి ఉంటుంది. నేను వెళ్ళగానే రచయితను కనుక ఆరాధనగా చూస్తుందేమో! ఎలా మాట్లాడాలి? కాఫీ ఇస్తూ సిగ్గు పడుతుందేమో! అలవోకగా నవ్వుతుందేమో!..

అనంతరంగా సాగిపోతున్న బ్రహ్మానందం ఆలోచనలకు బ్రేక్ వేస్తూ బస్సు విశాఖపట్నం వచ్చేసింది. అతడింకా మధురోహల్లో తేలుతూ, పూర్తిగా ఆనందాన్ని అనుభవించనీయనందుకు ఆతడికి డ్రైవర్ మీద కోపం కూడా వచ్చింది.

''ఒరేయ్ ఫూల్! ఇంకా వూహల్లో తేలడమేమిటి? గమ్యానికి చేరుకున్నావ్! ప్రత్యక్షంగా చూసి, ఆనందాన్నను భవించు! ఇంత త్వరగా నిన్ను చేర్చినందుకు డ్రైవర్ని అభినందించు!'' అంటూ బ్రహ్మానందం హృదయం మందలించింది.

''అవునవును!'' అనుకుంటూ కాలనీలో అడుగు పెట్టాడతడు. కాలనీలో ఐదారు వందల ఇళ్ళు న్నాయి. ఏ ఇంట్లో ఆమె ఉందో?

ఎవర్నడిగినా ఎవరూ చెప్పడం లేదు! ''ఆమె భర్త గారేం చేస్తుంటారు? రైల్వేలో ఏం ఉద్యోగం?'' అంటూ తిరిగి ఆతడ్ని ప్రశ్నించే వాళ్ళేకానీ, ఒక్కరూ వాళ్ళయిల్లు చూపించలేదు.

బ్రహ్మానందం వెతికి వెతికి విసిగిపోయాడు.

ఇక ఆ ప్రయత్నం విరమించుకొని, వెళ్ళిపోదామని, చివరి ప్రయత్నంగా మరో నాలుగిళ్ళు తిరిగే సరికి, అతడి అదృష్టం బావుండి అదే వరుసలో ఉంది వాహినిగారి ఇల్లు.

అయితే అతడూహించిన భావాల్లో ఒక్కదానికీ ఆమెకు పోలిక కుదర లేదు. నల్లగా, పొట్టిగా బొద్దుగా ఉందామె, వయస్సు ముప్పై పైనే ఉండవచ్చు!

బజర్ మ్రోగించే సరికి తలుపు తీసిందావిడే!

బ్రహ్మానందంగానికి ఆమే వాహిని అని తెలీదుగా!

''వాహిని గారున్నారండీ?'' అని అడిగాడు.

''నేనే! ఏం కావాలి? ఎవరు మీరు?'' అని అడిగిం దావిడ.

''నేనండీ! ఈ మధ్య వార పత్రికలో వచ్చిన పూదోటలో పిడకల వేట'' కథా రచయిత బ్రహ్మానందాన్ని!'' అని పరిచయం చేసుకున్నాడు.

''ఆహా! అలాగా! ఏం పని మీద వచ్చారు?'' అని అడిగిందావిడ.

ఇదేమిటీ! ఈవిడ ఇలా నిలబెట్టి మాట్లాడుతూందే! రచయితనని చెప్పగానే ఎగిరి గంతేసి, కుర్చీ చూపిస్తుందను కున్నాను! ఆదేం లేదు సరి, కదా పైగా ఏమిటనేని? అంటుందేమిటీ? అని మనసులో అనుకొని.

''అబ్బే! పనేం లేదండీ! మా తాతగారి వూరెళ్తూ మిమ్మల్నో సారి చూసి పోదామని వచ్చాను! మీరే కదా నా కథలోని తప్పు ఎత్తి చూపిస్తూ బావుం దని ఉత్తరం వ్రాశారు. ఆ డౌట్ తీరుద్దామని వచ్చాను! అన్నాడు బ్రహ్మానందం.

''డౌటా?'' అంటూ డౌట్‌లో పడిం దావిడ.

''అదేనండీ! పేడ పిడకలుగా మారిన వైనం నేను కథలో వ్రాయడం మర్చి పోయాను. అదే విషయాన్ని మీరు గుర్తించేశారు. ఇంతకీ ఆ పేడ పిడకలుగా మార్చిందెవరను కున్నారు. . . ? వాళ్ళ పనిషి లేదూ. అప్పలమ్మ అని కథలో కొంచెంసేపు కన్పిస్తుంది కదా! అదే చేసిందావిడ!'' వివరించాడు బ్రహ్మానందం.

''ఓహో! అదా! నిజానికి నే నసలు మీ కథని చదవనే లేదండీ! మా తమ్ముడు చదివి ఉంటాడు. వాడికి ఉత్తరాల పిచ్చి! ఎన్నో ఉత్తరాలు రాశాడు. ఏవీ పత్రికల్లో పడ లేదు. చివరికి మీ కథ మీద పడి ఉంటాడు. అచ్చులో పేరు చూసుకోవాలను కునే నా ముచ్చట కూడా కాదనలేక నాపేరనో ఉత్తరం పోస్ట్ చేశాడు. వాడి ఉత్తరం పడలేదు. కానీ, నా ఉత్తరం ప్రచురించారు. అంతే!'' అసలు విషయాన్ని అతి మామూలుగా చెప్పిం దావిడ.

సమాధానం విన్న బ్రహ్మానందం ముఖంలో కత్తి వాటుకు నెత్తురు బొట్టు లేదు! ✱

జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

| | |
|---|---|
| 30 రోజులలో తమిళ భాష | వెల 4-00 |
| 30 రోజులలో హిందీ భాష | వెల 3-50 |
| 30 రోజులలో కన్నడ భాష | వెల 4-00 |
| 30 రోజులలో మలయాళ భాష | వెల 4-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | వెల 4-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | వెల 7-00 |
| 30 రోజులలో ఉర్దూ భాష | వెల 4-50 |
| 30 రోజులలో మరాఠీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో బెంగాలీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో పంజాబీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో గుజరాతీ భాష | వెల 4-50 |
| 30 రోజులలో ఒరియా భాష | వెల 4-50 |

పై కనుబరచిన పుస్తకములన్ని తెలుగు మూలముగా ఇతర భాషలను 30 రోజుల్లో వ్యాకరణరీతిగా, వ్రాయుట, చదువుట, మాట్లాడుట, నేర్పించుగొప్ప గ్రంథములు.

BP BALAJI PUBLICATIONS
103 BHARATHI ROAD
MADRAS 600 014